# చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

బాలానగర్, ఏప్రిల్ 1 : చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీహెచ్‌ఈఎల్ ఆర్ అండ్ డీ సమీపంలో బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రాన్ని తెలుగు రాష్ట్రాల వోసీ సంఘం అధ్యక్షుడు జీ.కరుణాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చలి వేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం సంతోషదాయకం అన్నారు. ప్రస్తుత దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ తమతమ పనులలో బిజీబిజీగా గడుపుతున్న తరుణంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు చొరవ చూపడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆనంద్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సులోచనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి



## నిత్యావసర సరుకుల అందచేత

మియాపూర్, ఏప్రిల్ 1: ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ ఎన్‌టీఆర్ నగర్‌లో అక్తర్ బేగం సయ్యద్ నివాసంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, బట్టలు ఇతర వస్తువులు కాలిపోయిన విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ సోమవారం ఆమె నివాసాన్ని సందర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నెలకు సరిపడా నిత్యావసర వస్తువులతో పాటు కొంత ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, భాస్కర్, మున్నా, ఖాజా, బాలస్వామి, యాదగిరి, అరుణ, సలీం, రవీందర్, రాజు, వంశీ, అంజద్, అబ్బాస్, చోటు, ఖలీమ్ పాల్గొన్నారు.

## ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకోవాలి



మియాపూర్, ఏప్రిల్ 1: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ కాలనీలో పార్కులో సోమవారం వృద్ధులతో ఓటరు అవగాహనను చేపట్టారు. ఓటరు జాబితాలో తమ ఓటు హక్కును పరిశీలించుకోవటం, 18 ఏండ్లు నిండిన యువతతో ఓటు హక్కు నమోదు చేయించేలా ప్రోత్సహించటం, పోలింగ్ రోజున తప్పక తమ ఓటు హక్కును వినియోగించుకునే అంశాలను ఎన్నికల విభాగం సిబ్బంది తెలిపారు. ఓటు హక్కు వినియోగంలో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేయాలని ప్రతిన చేయించినట్లు నియోజకవర్గ ఓటు నమోదు అధికారి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.



## మహిళా కాంగ్రెస్ కమిటీల నియామకం

దుండిగల్, ఏప్రిల్ 1: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్ల మహిళా కాంగ్రెస్ కమిటీలను సోమవారం నియమించారు. తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత మొగిలి రావు ఆదేశానుసారం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరా ఆధ్వర్యంలో నియామక పత్రాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెక్రటరీ జాజుల రమ్య, వివిధ డివిజన్‌ల మహిళా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్కూటీ అదుపుతప్పి.. వ్యక్తికి గాయాలు

దుండిగల్, ఏప్రిల్ 1: ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనికీ చెందిన లంబా ఓజాల్(50) ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం తన స్కూటర్‌పై సూరారం కట్టమైసమ్మ ఆలయం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో కాలు విరగడంతో పాటు తలకు శరీర భాగాలకు గాయాలయ్యాయి. అయితే ఓజాల్ వెనుకే ఆటోలో వస్తున్న సమీప బంధువు ఇది గమనించి చికిత్స కోసం సమీపంలో ఓ వైద్యశాలలో చేర్పించారు. ఈ మేరకు క్షతగాత్రుడి కుమారుడు లంబా సాయికుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

***మరో చోట..***

రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా దూసుకువచ్చి వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. సూరారం కాలనీకి చెందిన బట్టి బాలకృష్ణ(39) సోమవారం మధ్యాహ్నం సూరారం మెయిన్‌రోడ్డులోని ఆర్యన్ వైన్స్ వద్ద రోడ్డు దాటుతుండగా గండిమైసమ్మ వైపు నుంచి షాపూర్‌నగర్ వైపు వెళ్తున్న అశోక్ లైలాండ్ వాహనం వేగంగా దూసుకొచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన బాలకృష్ణ కుడికాలుపై నుంచి టైర్లు దూసుకువెళ్లడంతో కాలు విరిగింది. దీంతో స్థానికులు వెంటనే అతడిని ఓ వైద్యశాలకు తీసుకువెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రుడిని గాంధీ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు కాలు తొలగించారు. బాధితుడి మేనల్లుడు తలారి సందీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఈస్టర్ వేడుకల్లో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళీనగర్ చౌరస్తాలో పాస్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్టర్ ర్యాలీలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో విప్పర్తి, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, ఏప్రిల్ 1

## పార్కు స్థలంపై వివాదం

**ఇరువర్గాలపై కేసులు నమోదు**

దుండిగల్, ఏప్రిల్ 1: పార్కు స్థలం వివాదంలో సూరారం పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 105లోని సిద్ధివినాయకనగర్ కాలనీకి చెందిన 1080 గజాల పార్కుస్థలం.. వివాదంలో కోర్టు పరిధిలో ఉన్నది. ఇదిలా ఉండగానే సదరు స్థలం చుట్టూ కొందరు వ్యక్తులు నాలుగు రోజుల క్రితం ప్రహరీ నిర్మించారు. దీనిని కాలనీ సంక్షేమసంఘం అడ్డుకోవడంతో పాటు ప్రహరీని కూల్చివేశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్యన గొడవ జరిగింది. ప్రహరీ నిర్మించిన వారిలో ఒకరు సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్ తలపై కొట్టడంతో అతడికి గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలు సూరారం పోలీసులను ఆశ్రయించగా ప్రహరీని కూల్చినందుకు కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై శ్రీనివాస్‌గౌడ్ ట్రెస్‌పాస్ కేసును, ఆస్తినష్టం అదే విధంగా కాలనీ సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌ను గాయపర్చిన కేసులో శ్రీధర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురిపై ఐపీసీ 320 సెక్షన్ ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు పేర్కొన్నారు.

## కిరాణా దుకాణం ముసుగులో గంజాయి విక్రయం

**మహిళ అరెస్టు, గంజాయి స్వాధీనం**

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 1: నానక్‌రాంగూడ గంజాయి వ్యాపారానికి కేంద్రంగా మారింది. చిన్న చిన్న కిరాణా దుకాణాలు, టీ స్టాళ్ల ముసుగులో గంజాయి విక్రయాలు చేపడుతున్నారు. నానక్‌రాంగూడలో కొన్ని కుటుంబాలు మొత్తం గంజాయి వ్యాపారంలోనే తలమునకలై ఉండటం ఈ ప్రాంతంలో గంజాయి వ్యాపారం ఏ స్థాయిలో కొనసాగుతుందో అర్థమవుతోంది. ఇటీవల వరుసగా నానక్‌రాంగూడలో గంజాయి విక్రేతలు పట్టుబడుతున్నారు. తాజాగా, కిరాణా దుకాణం ముసుగులో గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రాంగూడ లోథా బస్తీలో నివాసముండే అనురాధా బాయి (39) స్థానికంగా ఓ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నది. సులభంగా డబ్బు సంపాదించేందుకు కిరాణా దుకాణంలో గంజాయి విక్రయించడం ప్రారంభించింది. ధూల్‌పేట నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చి.. చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఎక్కువ ధరకు స్థానికంగా విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలకు విక్రయిస్తున్నది అనురాధా బాయి గంజాయి వ్యాపారంపై సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు.. కిరాణా దుకాణంపై దాడి చేశారు. ఈ దాడిలో రూ.20వేల విలువైన 300 గ్రాముల (39 ప్యాకెట్లు) గంజాయి, రూ.1,200 నగదు, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అనురాధా బాయిని అదుపులోకి తీసుకున్న ఎస్‌వోటీ పోలీసులు.. తదుపరి విచారణ నిమిత్తం గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

***జగద్గిరిగుట్ట పరిధిలో..***

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 1: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఫిరోజ్‌గూడకు చెందిన రమేశ్ కొంతకాలంగా గంజాయి రవాణా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు సోమవారం అతడిని ఆల్విన్ కాలనీ సమీపంలో పట్టుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు.

## బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 1: రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యాక్షుడిగా శంషాబాద్ మండలం చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన రామగల్ల వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ఉపాధ్యాక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. తనకు పదవి అప్పగించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్, ఏప్రిల్ 1: స్థానికంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తెలిపారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

## కష్టకాలంలో కార్మికులకు అండగా ఉంటా

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 1 : కష్టకాలంలో కార్మికులకు అండగా ఉండి వారి హక్కుల కోసం పోరాడుతానని బీఆర్‌ఎస్ పార్టీ కార్మిక విభాగం నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నాడు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలో మోడీ అపార్ట్‌మెంట్ బిల్డర్స్‌లో భవన నిర్మాణ పనులు చేస్తున్న గుర్రాల సత్యనారాయణ అనే కార్మికుడు గతనెల 19న ప్రమాదవశాత్తు కిందపడి మరణించాడు. బాధితుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించగా బాధితుడు కార్మిక నాయకుడు రవిసింగ్‌ను ఆశ్రయించాడు. వెంటనే మోడీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్స్ యాజమానితో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ.8 లక్షలు నష్టపరిహారం ఇప్పించేలా కృషి చేశాడు. ఈ సందర్భంగా బాధిత కటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనీల్, శ్రీనివాస్‌చారి, సుదర్శన్, జగన్, ప్రేమ్ తదితరులు న్నారు.





బాధిత కుటుంబానికి నష్టపరిహారం డబ్బులను అందజేస్తున్న రవిసింగ్

## విగ్రహాల ప్రతిష్ఠాపనలు.. ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 1: రంగారెడ్డినగర్ డివిజన్ విజయపురి కాలనీలో పోచమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభన, బొడ్రాయి ప్రతిష్ఠాపన, మహాగణపతి పూజ శాంతి హోమాలు, మహాపూర్ణాహుతి వేడుకలు ఘనంగా జరిగాయి. 128 చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో జరిగిన భద్రకాళి సహిత వీరభద్ర స్వామి, కాలభైరవ సహిత నవగ్రహ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనలు జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, ఉత్సవ కమిటీల నిర్వాహకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సందడిగా నార్త్‌సిటీ హై స్కూల్ వార్షికోత్సవం



దుండిగల్, ఏప్రిల్ 1: సూరారం డివిజన్ వెంకట్రాంనగర్(మస్తానాబిల్డర్స్)లోని నార్త్ సిటీ హైస్కూల్ 23వ వార్షికోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోలా వెంకటేశ్ ముదిరాజు, ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ కొండ్రా, పాఠశాల వ్యవస్థాపకులు కోలా రవిందర్‌ముదిరాజు, ట్రెస్మా ప్రెసిడెంట్ రామేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, వినోద్, దయాకర్, భూపాల్‌రెడ్డి, శ్యాంతో పాటు పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పరుపుల గోదాంలో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 1: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లో ప్రమాదవశాత్తు కాటన్ పరుపుల గోదా ములో సోమవారం ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం కారణంగా మంటలు చెలరేగడంతో పొగ వ్యాపించి పూర్తిగా కమ్ముకుంది. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే రెండు ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ పరిశీలించి సిబ్బందితో కలిసి మంటలను ఆర్పివేశారు. పరిశ్రమలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ముడి సరుకుతోపాటు తయారు చేసిన కాటన్ బెడ్లు అగ్నికి ఆహుతయ్యాయని తెలిసింది. ఘటనపై మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ మధు తెలిపారు.

## ఆటిజాన్ని ప్రారంభంలోనే పసిగట్టాలి





సమావేశంలో పాల్గొన్న ఐఐపీహెచ్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 1: మందబుద్ధి గల చిన్నారులను తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ప్రమాదమేమీ కాదని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటాల అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఐఐపీహెచ్ సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఎదుగుదల లోపం కారణంగా చాలామంది పిల్లలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. మంగళవారం ప్రపంచ మంద బుద్ధి(ఆటిజం) నివారణ దినం సందర్భంగా వయస్సుకు తగ్గట్టు పిల్లల్లో రావాల్సిన మానసిక ఎదుగుదల ఉండాలని అన్నారు. ఆటిజాన్ని ప్రారంభంలోనే గుర్తించాలని, నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం నాడీ సంబంధిత రుగ్మతగా(న్యూరోలాజికల్ డిజార్డర్)తో బాధపడాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వ్యాధి అరుదైనదని 100 పిల్లల్లో ఒకరికి ఉంటుందని వివరించారు. నివారించడంలోనే అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మూడేండ్లు నిండకముందే లక్షణాలు కనిపిస్తాయన్నారు. లింగ భేదంతో సంబంధం లేకుండా, తరచుగా మూర్ఛ, నిరాశ, ఆందోళన హైపరాక్టివిటీ డిజార్డర్ వంటి రుగ్మతలను కలిగి ఉంటాయన్నారు. పెరుగుతున్న టెక్నాలజీతో అనేక మందులు సైతం వచ్చాయని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజన్‌శుక్లా, రోహిత్ , జననిచారి, మరినా, కిరణ్, యూనిసెఫ్ సీఎఫ్ఓ జెలలేమా, ఫెర్నాండేజ్ దవాఖాన ప్రతినిధి తేజో ప్రతాఫ్, దేదీప్యా, అంకురా ఆసుపత్రి సుగుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక



బాలానగర్, ఏప్రిల్ 1: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం రాత్రి ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బడీ మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయనతో పాటు మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులతో కలిసి ప్రార్థనలు చేసి సహ పంక్తి బోజనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, పండాల సతీశ్‌గౌడ్, మైనార్టీ నాయకులు ఎండీ గౌసుద్దీన్, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, కర్రె జంగయ్య, మక్కల నర్సింగ్, హరినాథ్, మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

## అగ్ని ప్రమాద భద్రతపై అవగాహన

మూసాపేట, ఏప్రిల్1: వేసవిలో అగ్ని ప్రమాదల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ భారీ భవనాలు, షాపింగ్‌మాల్స్‌ల యజమానులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లలో ప్రమాదం జరిగితే మంటలు ఆర్పేందుకు భవనాల్లో అగ్నిమాపక శాఖ సూచించిన అవసరమైన పరికరాలు, పనిముట్లు, ఉన్నాయా లేవా అని ఎప్పటికప్పుడు గమనించాలి.. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపకశాఖ, పోలీస్ శాఖ, అత్యవసర సేవలకు వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సీఐ కృష్ణమోహన్, కేపీహెచ్‌బీ కాలనీ సీఐ వెంకటేశ్వరావు, బాచుపల్లి సీఐ ఉపేందర్ రావు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలానగర్ ఏసీపీ హనుమంతరావు

బాలానగర్, ఏప్రిల్ 1: వేసవికాలం సందర్భంగా కెమికల్ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఆయా పరిశ్రమల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. సోమవారం బాలానగర్ పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన సమావేశానికి సబ్ డివిజన్ పరిధిలోని బాలానగర్ ఎస్‌హెచ్‌వో నవీన్‌కుమార్, జీడిమెట్ల ఎస్‌హెచ్‌వో, సనత్‌నగర్, జీడిమెట్ల ఫైర్ ఇన్‌స్పెక్టర్లు పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. కెమికల్ పరిశ్రమ,గోడౌన్‌ల నిర్వాహకులు భవనం వద్ద అగ్ని ప్రమాదాలు నివారణకు అగ్నిమాపక శాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపకశాఖ, పోలీస్‌శాఖల వారికి తక్షణం సమాచారం అందించాలని సూచించారు.

**GENERAL BODY MEETING**

The General Body Meeting of SREE RADHIKA CO-OPERATIVE HOUSING SOCIETY LIMITED, Regd. No. T.B.6.425, situated at beside HP Petrol Pump, Vinayakanagar, Gachibouli, Sherlingampally Mandal, R.R. District, Hydrabad-500 032, TELANGANA STATE will be held on 13-04-2024 at 10.30 AM in the Rice Premises. **PRESIDENT**